క్లుప్తంగా

గిరిజనులకు అసైన్‌మెంట్ భూములివ్వాలి

సుండుపల్లి (రాయచోటి టౌన్) : గిరిజనులకు అసైన్‌మెంట్ భూములివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు గిరిజన మహిళలతో కలసి ఆర్ఐ ఫణీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లెలో సుమారు 50 సంవత్సరాలకు పైగా 25 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నారని చెప్పారు. అయితే వారికి సాగు చేసుకోవడానికి భూమి లేదన్నారు. ఆ గ్రామంలో ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిని వీరికి అసైన్‌మెంట్‌లో ఇవ్వాలని కోరారు.

మామిడి తోటలో 'డ్రిప్' ఉపయోగకరం

లక్కిరెడ్డిపల్లె : మామిడి తోటలో డ్రిప్ సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. ఉద్యానశాఖ, సూక్ష్మ నీటిసాగు పథకం సంచాలకులు ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సంబంధించి రైతు భరోసా కేంద్ర సిబ్బందికి అనంతపురం గ్రామంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు డ్రిప్ సౌకర్యం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఎంఐడీసీ చంద్రశేఖర్ సూక్ష్మ నీటిసాగుపై అవగాహన కల్పించి, మెళకువలు తెలియజేశారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హైదర్‌వలి

రామాపురం : గ్రామ, వార్డు సచివాలయం అధికారులు, సిబ్బంది సమయం పాటించాలని ఎంపీడీఓ హైదర్‌వలి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయిలో సమస్య పరిష్కారం కాకుంటే మండలస్థాయి అధికారులకు వెంటనే పంపాలన్నారు. ఎవరైనా సమయం పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నివాస స్థలాలు కేటాయించండి

రాజంపేట రూరల్ : చెర్లోపల్లిలోని దళిత, గిరిజనులకు నివాస స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీకేఎంయూ నియోజకవర్గ అధ్యక్షుడు బి.రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం హస్తవరం సచివాలయం వద్ద నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.మణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో వందలాది మందికి నివాస స్థలాలు లేక ఒకే గృహంలో రెండు నుంచి మూడు కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నట్టు పేర్కొన్నారు. వీరికి జగనన్న కాలనీలో నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. నివాస స్థలాలు మంజూరు చేయకుంటే జూలై మొదటి వారంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

మందక్రిష్ణ పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

రాయచోటి అర్బన్ : ఈనెల 20వ తేదీన కడప జిల్లాలో జరిగే మందక్రిష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బండకింద మనోహర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో అన్నమయ్య జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న కడపలో జరిగే మందక్రిష్ణ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నేత జోనస్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు పిచుకబాబు మాదిగ, హరిబాబు, పూసపాటి రెడ్డయ్య, మహేశ్వరయ్య, రాచరాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు వంగిమళ్ల రమణ, రాయచోటి నేతలు సి.వి.రమణ, గుంటిమడుగు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల సమర్పణ



రాజంపేట రూరల్ : మండల పరిధిలోని మదనగోపాల(ఎంజీ)పురంలో గంగమ్మ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. జాతరలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గంగమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, కొందూరు విశ్వనాథరాజులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



రాజంపేట: సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట : గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం చెయ్యేటి పరివాహక గ్రామమైన తొగురుపేట గ్రామంలో ప్రజలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలే దేశానికి వెన్నెముక అన్నారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామం చెంతకు సచివాలయం వ్యవస్థతో పాటు రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చారన్నారు. తమ గ్రామంలో తమ సమస్యలను పరిష్కరించుకునే వీలుగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామీణుల నుంచి ఏ సమస్య వచ్చినా వెనువెంటనే పరిష్కరించే దిశగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. పల్లె ముంగిటకు పాలన రావడంతో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పులపత్తూరు సర్పంచ్ జగన్, తొగురుపేట సర్పంచ్ వెంకటేశు, యాదవ సంఘం నాయకుడు ఆనాల మధుయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు భీము సుబ్బారెడ్డి, సంతోష్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, జగపతి, వాకా ప్రసాద్, వెంకటసుబ్బయ్య, మారయ్య, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, నాయకులు గుండు మల్లికార్జునరెడ్డి, మధురాజు, చెంచిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తొగురుపేట వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

తొగరుపేటవాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ అన్నారు. ప్రధానంగా గ్రామంలో ముస్లిం, హిందూ స్మశాన వాటికల ఏర్పాటుపై దృష్టి సారించినట్టు చెప్పారు. జగనన్న కాలనీలో ఇచ్చిన ఇంటి స్థలాలను పరిశీలించామన్నారు. రోడ్డు, కరెంటు, తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంటపొలాల రోడ్లను పరిశీలించారు. అంతకముందుగా గ్రామంలో కలియతిరిగి గ్రామస్తులతో భేటి అయ్యారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన వీరబల్లె మండలం ఓదివీడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో సర్పంచ్ పోరుమామిళ్ల శంకరమ్మ అధ్యక్షతన జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి దేశానికి పట్టుకొమ్మ లాంటిదన్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షాకీర్ మనవడి పుట్టినరోజు సందర్భంగా వేడుకలలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో పెదివీడు సర్పంచ్ నాగిరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామరాజు, శివరామ, కోనేటి సుబ్బరామ రాజు, ఏపీఓ నాగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనను ఓర్వలేకే విమర్శలు

- పేదలకు ఇంటి స్థలం కేటాయింపుపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన రాజంపేట ఎమ్మెల్యే మేడా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పేదలకు పక్కా గృహాలపై తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చేసిన దుర్మార్గమైన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మేడా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గూడులేని నిరుపేదలకు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనందిస్తుంటే సహించలేని చంద్రబాబు స్థాయిని దిగజార్చుకొని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కృషి చేస్తుంటే ప్రతిపక్ష నేత ఓర్వలేకున్నారని తెలియజేశారు. పేదలకు ఇచ్చిన 1.5 సెంట్ల స్థలం దేనికి సరిపోతుందని చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. గత టీడీపీ ప్రభుత్వంలో మీరు ఎంత మంది పేదలకు గృహ నిర్మాణాల కోసం సొంత స్థలాలు కేటాయించారని, ఎంత మందికి పక్కా గృహాలు ఇచ్చారని మీడియా సాక్షిగా ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు తమ ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని, తమకు రాష్ట్ర ప్రజలు 5 సంవత్సరాల పరిపాలన కాలం అప్పజెప్పారని, ఈ 5 సంవత్సరాలలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రజలకు ఏమేమి వాగ్దానాలు చేసిందో అవన్ని అమలు చేసి, 2024 ఎన్నికల్లో ప్రజలను ఓటు వేయమని గర్వంతో అడుగుతామని తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల ఎంపీపీ గెద్దం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ దున్నూతల రఘురాంరెడ్డి, సర్పంచులు శేఖర్‌రెడ్డి, మేరువ శివనారాయణ, వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు ముమ్మడి నారాయణరెడ్డి, బాషా, టక్కోలి శివారెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, మాచుపల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఎండలు అధికంగా ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయికిషోర్ రెడ్డి హాజరై మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ ఎక్కడా సమస్యలు తలెత్తిన పరిష్కరించేలా చూడాలన్నారు. గ్రామాలలో తాగునీరు, రైతులకు విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో మండల వ్యాప్తంగా తాగునీటి కోసం అనేక బోర్ల మోటార్లను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయాలను వెంటనే పూర్తి చేయాలని, సచివాలయాలు పూర్తికాగానే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఐసీడీఎస్ సమస్యలను అనసూయమ్మ సభలో చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి శ్రీరాములు రైతులకు ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, వైస్ ఎంపీపీ–1 గూడూరు గౌరీశంకర్ రాజు, వైస్ ఎంపీపీ–2 కొమ్మూరు సుమిత్ర, అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించండి



సీమంతం చేస్తున్న జిల్లా అధికారిణి వరలక్ష్మి

లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులకు అందించాలని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాకులవరం గ్రామం మిద్దికాడపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. గర్భిణులకు సీమంతం జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలబాలికల ఆరోగ్య విషయాలు గర్భిణులకు, బాలింతలకు అందించే ఆహార విషయాలపై అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ప్రతినెల గర్భిణులకు ఐరన్, విటమిన్ మాత్రలు తప్పకుండా అందించాలన్నారు. పిల్లలకు బాలామృతాన్ని సక్రమంగా అందించాలన్నారు. అనంతరం అదే గ్రామంలో చెత్తనుంచి సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పట్నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దాల్బి, అరుణకుమారి సుజాతమ్మ, పంచాయతీ కార్యదర్శి ఇమాం బాషా, హెల్పర్ అసిస్టెంట్ గణేష్, మహిళా పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయానికి కంప్యూటర్ వితరణ

రాయచోటి టౌన్ : గత నెలలో ఆలయ ఆదాయాన్ని కెనరా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినందుకు ఆ బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్ ఒక కంప్యూటర్‌ను ఆలయానికి వితరణ చేశారు. గురువారం సాయంత్రం ఆలయానికి వచ్చిన మేనేజర్ ఆలయ కమిటీ చైర్మన్ పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలకు అందజేశారు. అనంతరం వీరిని ఆలయ అర్చకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, సుగవాసి శ్యామ్, కెనరా బ్యాంక్ సబ్ స్టాఫ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవా వజ్ర అవార్డుల ప్రదానం



ఎం. పద్మజ



బి. శైలజ

రాయచోటి టౌన్ : గ్రామాలలో వలంటీర్లుగా తమ విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం సేవా వజ్ర అవార్డుతో సత్కరించింది. రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరంలో ఎం.పద్మజ, బి.శైలజలకు ఈ అవార్డులు దక్కాయి. వీరిని సర్పంచ్ ప్రభావతమ్మ, తిరుపాల్ నాయుడు అభినందించారు.

స్కిల్ సెంటర్లతో నైపుణ్యం



నియామకపత్రాలతో యువతీయువకులు, అధికారులు

రాయచోటి టౌన్ : విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు స్కిల్ సెంటర్‌లు ఉపయోగపడతాయని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ నిరుద్యోగ యువతీయువకులకు సూచించారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో 60 మందికి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.

మునగ రైతుకు లాభాల పంట



మండలంలో మునగ చెట్లను వేసిన దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని పలు గ్రామాలలో చిన్నకారు రైతులు హైబ్రీడ్ మునగ పంట సాగు వల్ల ప్రతిరోజూ ఆదాయం చూస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారస్తులు రైతులకు 40 నుండి 50 రూపాయలు ఇస్తూ.. కిలో 80 రూపాయల వరకు అమ్ముతున్నారు. దీంతో రైతుకు ఎకరా పంటకు ప్రతి రోజూ 2000 రూపాయలు వరకు వస్తోంది. రాఘవరాజాపురం, కేసీ అగ్రహారం, ఉప్పరపల్లి, అనంతరాజుపేట తదితర గ్రామాలలో రైతులు ఉన్న కొంత భూమిలో ఎక్కువగా బెంగళూరు నుంచి విత్తనాలు తెచ్చి సాగు చేస్తున్నారు. అలాగే పలువురు పెద్ద ఎత్తున కూడా పండిస్తున్నారు. ఎక్కువ శాతం రైతులు డ్రిప్ ద్వారా రైతులు పంట పండిస్తున్నారు. దీని వల్ల మంచి దిగుబడి వచ్చి పెట్టుబడి తగ్గుతుంది. లేత దశలో తెగుళ్లు నివారిస్తే మూడు సంవత్సరాల వరకు పంట తీయవచ్చు. ఏడాది ప్రతి నెలా మూడు దఫాలు కాపుకోయచ్చు, లేదా మార్కెట్‌ను బట్టి ప్రతి రోజూ కోతకోయచ్చు. ప్రతి రోజు వచ్చే ఈ పంటకు తెగుళ్లు సోకకుండా మందులు పిచికారీ చేస్తే ఫలితాలు బాగుంటాయి. పంట సాగు ఆరు నెలలు ఎకరాకు 30 వేలు ఖర్చు వచ్చినా.. తరువాత ఖర్చు భారం ఉండదు. కలుపు సమస్య వుండదు. కూలీల భారం రాదు. ప్రస్తుతం రైతులు మునగ కాయలను మార్కెట్‌కు కేజీ రూ.50ల ధరతో నిత్యం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మంచి ధర పలుకుతుండటంతో రైతులకు మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇంకా చీడపీడల నుంచి చెట్లను, పురుగుల నుంచి కాయలను కాపాడుకోగలిగితే మరింత లాభాలను పొందవచ్చు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న విశ్వనాథరెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని మార్కెట్ యార్డు చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో పాలకమండలి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి పాలకమండలి సభ్యులు సహకారం అవసరమన్నారు. మార్కెట్ యార్డులో ఇచ్చిన టార్గెట్‌కు మించి ఆర్థికంగా ముందున్నామన్నారు. అదనపు షెడ్‌లు ఏర్పాటు చేసి కూరగాయల మార్కెట్ ఏర్పాటునకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు చేరువగా మార్కెట్‌ను వినియోగించుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. రాయలసీమలోనే లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు మూడో స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో మొదటి స్థానంలో ఉంచడానికి ప్రయత్నిస్తానన్నారు. వ్యాపారస్తులకు అనుకూలంగా ఉండటానికి గాలివీడు టౌన్ ప్రాంతంలో గోడౌన్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న రూ. 36 లక్షల నిధులతో ప్రహరీగోడను నిర్మిస్తామని తెలిపారు. పశువుల సంత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ జయరాణి, సింగల్ విండో ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఏపీబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అంజనేయులు, ఇన్‌చార్జ్ మార్కెట్ కమిటీ సెక్రటరీ మదన్‌మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ స్పందించిన తీరుపై హర్షం



రాయచోటి : పవిత్ర హజ్ యాత్రికులకు అదనపు భారంగా మారిన నిధులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పడమే కాకుండా వెను వెంటనే నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాయచోటిలో డిప్యూటీ వైస్ చైర్మన్ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మైనార్టీల పట్ల ప్రభుత్వం చూపుతున్న చొరవను ఆమె అభినందించారు. గన్నవరం, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి బయలుదేరే 1813 మంది యాత్రికులకు ఈ సౌకర్యం కల్పించారని తెలిపారు. ప్రతి యాత్రికుడి విమాన టికెట్‌పై రూ.80 వేలు అదనపు భారం పడటంపై ఆందోళన చెందారని, అదనపు భారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ, మైనార్టీల వ్యవహారాల శాఖ మంత్రులతో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయిందన్నారు. సాంకేతిక కారణాల వలన ఆయా మంత్రిత్వశాఖలు తమ నిస్సాహాయతను ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి రూ. 14.51 కోట్లు ఆర్థిక సహాయం విడుదల చేశారన్నారు. మైనార్టీలపై సీఎం జగన్ చూపించిన చొరవపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

స్పందన అర్జీలను పరిశీలించిన సబ్ కలెక్టర్



తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఓబులవారిపల్లె : స్పందనలో వచ్చిన అర్జీలను సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని వైకోట, లింగిరెడ్డిపల్లె, పెద్దఓరంపాడు గ్రామాలలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సబ్ కలెక్టర్ స్వయంగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లింగిరెడ్డిపల్లె గ్రామంలో కబ్జాకు గురైన పెద్దఓరంపాడు సర్వే నెంబరు. 2093ను పరిశీలించారు. స్మశానాలు కబ్జాకు గురయ్యాయని తమ భూములు కబ్జా చేశారని ప్రజలు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత సర్వే నెంబరులలో భూములను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడి స్పందన పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీర్ మున్ని, ఆర్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : స్పందనలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయంలో గురువారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామల్లో స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సర్పంచ్ సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.రవిశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె, గువ్వలచెరువు, కొండావాండ్లపల్లె, హసనాపురం గ్రామాల్లోని రైతులతో ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీఓ రంగస్వామి గురువారం ముఖాముఖిగా మాట్లాడారు. మండలంలో జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సప్లై ఛానెల్‌లకు ఎత్తిపోతల పథకానికి భూ సేకరణలో కల్పనాయినిచెరువు, గోపగుడిపల్లె, గువ్వలచెరువు గ్రామాల పరిధిలో 28.53 ఎకరాలు, హసనాపురం పెద్ద చెరువు నుంచి చిన్నచెరువుకు 10.63 ఎకరాలు, కొండావాండ్లపల్లె నుంచి కుమ్మరకుంట వరకు 7 ఎకరాల భూమి ఎత్తిపోతల పథకానికి అవసరమని నష్టపరిహారంగా ప్రభుత్వం నుంచి రైతులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన భూమి విలువలను తయారు చేసి తమకు పంపాలని రామాపురం తహసీల్దార్ అరవింద్ కిషోర్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఇరిగేషన్ ఏఈ మహబూబ్‌బాషా, ఆర్ఐ వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర

రైల్వేకోడూరు అర్బన్ : కొత్త కోడూరులో గంగమ్మ జాతర గురువారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. జాతరకు పలు గ్రామాల ప్రజలు, భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ ఉపసర్పంచ్‌తో పాటు ప్రముఖులు పూజలు చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఒంటిమిట్ట : మండలంలోని గ్రామాలలో గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి పొదలకూరు, దుత్తలూరు, నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేశామని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నెల్లూరు, దుత్తలూరు, పొదలకూరు కమిటీ అధ్యక్షుడు డి. సూరమౌలి, పెంచల నరసయ్య, జి. ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కిశోర్, మధు, చలపతి, నరసారెడ్డి, పెంచలరెడ్డి, వెంకటేశ్వర్లు, భాగ్యమ్మ, గాయత్రి, మాలవిక, సుబ్బమ్మ, జి.నరసింహ ప్రసాద్, కె.వి రత్నం, ఎం.సోమశేఖర్, పి.ప్రదీప్, సీహెచ్ సునీల్, ఎ.వేణు, ఎస్.శ్రీనివాసులు, డి.వెంకట్, ఎం.మోహన్, పి.శేష రత్నమ్మ, ఎం.నారాయణమ్మ, కె. విజయలక్ష్మి, సి.హెచ్.సుమలత తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిబిరాలు

సిద్దవటం : గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చినట్టు గ్రంథాలయాధికారిణి లక్ష్మినారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు డ్రాయింగ్‌తోపాటు పుస్తక పఠనం చేయించామన్నారు. అంతేగాకుండా సిద్దవటం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సుజాత, డిజిటల్ అసిస్టెంట్ మృణాళిని విద్యార్థులకు మొబైల్ వాడటం వల్ల కలిగే నష్టాలను, లాభాలను వివరించినట్టు ఆమె చెప్పారు.

రైల్వేకోడూరు అర్బన్ : గ్రంథాలయ వేసవి శిబిరాలలో భాగంగా స్థానిక గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గ్రామర్‌పై ఉపాధ్యాయుడు నరసింహులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యార్థులు గ్రంథాలయ వేసవి శిబిరాలను వినియోగించుకొని ఇంగ్లిష్‌లో తర్ఫీదు పొందాలన్నారు.

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల భాగంగా గురువారం 32 మంది విద్యార్థులతో తరగతులు నిర్వహించామని నిర్వాహకుడు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ మృదంగ వాయిద్య నిపుణుడు వెంకటేష్ విద్యార్థులకు సంగీతంపై మెళకువలు నేర్పించారు. అలాగే తెలుగు ఉపాధ్యాయుడు జి. శాంతి విద్యార్థులకు వ్యాకరణాన్ని తెలియజేశారు. పుస్తక పఠనం, కథలు చెప్పించడమే కాకుండా పాటలు పాడించడం, డ్యాన్సులు, ఆటలు ఆడించారు.